అదే సమయంలో--  వనజాక్షి లోనికొచ్చింది.

"ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టున్నావ్ ..... డిస్టర్బ్ చెయ్యడం లేదుకదా!"

"లేదు మేడమ్! యూ ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్" చిర్నవ్వుతో ఆహ్వానించింది మహతి.

"చెప్పండి మేడమ్!" అడిగింది.

"నీ పనేదో కానీ. తర్వాత నేనొచ్చిన పని చెప్తాను."

"మన ప్రొడక్టుని యాడ్ కాంపైన్ చేయిద్దామని యాడ్ ఏజెన్సీ కోసం సెర్చింగ్ వెరైటీగా చెయ్యాలి. మన బడ్జెట్‌కు సరిపోవాలి" చెప్పింది మహతి.

"ఈ మధ్య పత్రికలు తిరగేశావా నువ్వు? యాడ్స్ ఇండియా అని కొత్తగా ఒక యాడ్ ఏజెన్సీ వచ్చింది. సుమదేవ్ అని రుజల్ట్ ఓరియంటెడ్ పర్సన్ ఫేమస్ పర్సనాలిటీ ఇన్ యాడ్ వరల్డ్. వినేవుంటావ్. మనది కొత్త ప్రొడక్టు, కొత్త ఏజెన్సీకిస్తే బావుంటుందని నా ఎడ్వైజ్. "

"ఎక్కడ ఆఫీస్?" అడిగింది మహతి.

"ఎంక్వయిరీస్‌కి ఫోన్ చెయ్యి" అసిస్టెంట్‌ని పిలిచి, ఆ పనిని అప్పగించి--

"ఇప్పుడు చెప్పండి మేడమ్!" అంది.

"ఏం లేదు మహతి! నిన్ను మొట్టమొదటిసారి చూసినపుడే అనుకున్నాను, నువు పట్టుకున్నదల్లా బంగారమౌతుందని. నాలో ప్రతిభ లేకపోయినా ప్రతిభను మాత్రం గుర్తించే శక్తి నాకుంది. ఈ టైమ్‌లో నీకివ్వన్నీ చెప్తే అతిశయోక్తుల్లా ఉంటాయికానీ, చూడు మహతీ! జెన్నీ కిడ్డీస్‌వేర్ స్టిచింగ్ కాంట్రాక్టు నాకివ్వమని అడగడానికొచ్చాను. అంతే" మొహమాటంగా అందామె.

నవ్వింది మహతి.

"ఒక్కసారి రఘురామశెట్టిగారితో కూడా మాట్లాడి"

"గుర్తుంచుకో. నే వెళ్తాను మరి" లేచింది వనజాక్షి.

మహతి అసిస్టెంట్ వచ్చాడు.

"యాడ్స్ ఇండియా, యాడ్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ లైన్లో ఉన్నారు మేడమ్!" ఫోనందుకుంది మహతి .

*                *                *                *

మర్నాడు ఉదయం-- తొమ్మిదిగంటలవేళ-- యాడ్ ఇండియా ఆఫీసులో ఉంది మహతి. అప్పటికింకా ఎమ్.డి. మధుకర్ రాలేదు.

సుమదేవ్‌తో మాట్లాడుతోంది మహతి.

"యూత్ అండ్ సినిమా మేగజైన్స్ అన్నీ కవరు చెయ్యమంటారు" జన్నీ డ్రెసెస్‌లో నాగార్జున ఫోటోల్ని చూస్తూ అడిగాడు సుమదేవ్ .

"యాడ్స్ షుడ్ బి సింపిల్ అండ్ ఎట్రాక్టివ్ ..... విత్ సింపిల్ కాప్షన్!"

"గివ్ మీ ట్వంటీఫోర్ అవర్స్ టైమ్. కొన్ని డిజైన్స్ పంపుతాను. ఓకే!"

"యాక్సెప్ట్ చేసిన డిజైన్స్‌తోపాటు చెక్ పంపుతాను" లేచింది మహతి.

మహతి యాడ్ ఇండియాలోంచి బయటికొచ్చి ఆటో ఎక్కింది.

అప్పుడే--

అక్కడాగిన ఆటోలోంచి దిగాడు మధుకర్ . మెట్లెక్కి ఆఫీసులో కెళ్ళాడు. సుమదేవ్‌ని చూసి ఆశ్చర్యపోయాడు.

"సడన్‌గా వచ్చారే?"

“బాంబే బేస్డ్ కంపెనీ ఓ కొత్త సోప్‌ని ఇంట్రడ్యూస్ చేస్తోంది స్నోబాల్ అని. బోచర్స్ అన్నీ తెచ్చాను. యాడ్స్ ప్రిపేర్ చెయ్యాలి. అలాగే జన్నీ ఫాబ్రిక్స్ మానేజింగ్ పార్ట్‌నర్‌ట ..... వచ్చారు. దీనికి నాగార్జున మోడలింగ్ చేసాడు చూడు. ఆ మానేజింగ్ పార్ట్‌నర్ చాలా ఏక్టివ్. చూస్తుంటే జన్నీ మెటీరియల్ మార్కెట్లో సూపర్ హిట్టవుతుందనిపిస్తుంది. స్టేట్ లెవెల్లో కాంపైన్ కాబట్టి మన యాడ్ ఏజెన్సీకి కూడా ప్రెస్టేజ్ ఇష్యూ. ఇదిగో చూడు.”

జన్నీ మెటీరియల్, నాగార్జున ఫోతోలు, యాడ్స్ డిటైల్స్ సంబంధించిన పేపర్స్ వున్న కవర్‌ను ముందుకు తోశాడు.

“ఇందులో క్రియేటివిటీకి బాగా స్కోపుంది సర్! జన్నీ మెటీరియల్ యాడ్స్‌ని నేను స్వయంగా టేకప్ చేస్తాను” అన్నాడు మధుకర్.

“అయితే నేను స్నోబార్ మీద కూర్చుంటాను. బై ది బై! నీ పర్మిషన్ లేకుండానే స్టాఫ్‌నందర్నీ పరిచయం చేసేసుకున్నాను. జమ్స్‌ని సెలక్టు చేశావ్. కంగ్రాట్స్!”

ఆ కాంప్లిమెంట్‌కి సంతృప్తిగా నవ్వాడు మధుకర్.

“ట్వంటీఫోర్ అవర్స్ నువ్వు మాయం అయిపో, ఏదైనా హోటల్ రూం తీసుకుంటావా?”

“అంత అవసరం లేదనుకుంటాను సర్! రేపు మార్నింగ్ సెవనోక్లాక్‌కల్లా రఫ్ డిజైన్స్‌తో మీ దగ్గరుంటాను. ఈవెనింగ్ ఓ టూ అవర్స్ మాత్రం ఫ్రెండ్స్‌తో బయటకెళ్ళాలి.”

“డ్రింక్ పార్టీ అయితే నన్ను పిలవ్వయ్యా! ఐ లైక్ డ్రింక్స్” నవ్వుతూ అన్నాడు సుమదేవ్.

తనూ నవ్వేసి జన్నీ ఫాబ్రిక్స్ మెటీరియల్‌తో తన ఛాంబర్‌లో కెళ్ళిపోయాడు మధుకర్.

వైట్ పేపర్స్ ముందేసుకుని కూర్చున్నాడు.

సాయంత్రం ఆరయింది.

*     *     *     *

డాక్టర్ హేమలత ఎదురుగా కూర్చుంది మహతి.

"నీకిది హేపీ న్యూసో, అన్‌హేపీ న్యూసో నాకు తెలియదుగానీ, నౌ యూ ఆర్ కేరీయింగ్. యూ ఆర్ ప్రెగ్నెంట్."

ఆ మాటకు మహతి ఎర్రటి బుగ్గలు మరింత ఎర్రగా మారాయి.

"ఇట్స్ ఎ గుడ్ న్యూస్ ఫర్ మి. మేల్ బేబీ, ఆర్ ఫీమేల్ బేబీ, చెప్పు హేమా!" సంతోషంతో ఉప్పొంగిపోతూ అడిగింది మహతి.

"అంత తొందరయితే ఎలా? స్కానింగ్ రిపోర్టు రావాలిగదా!"

"ఎంత సేపట్లో వస్తుంది?"

"టూ అవర్స్‌లో వస్తుంది. రాగానే చెప్తాను"

"డెలివరికి ఇంకెన్నాళ్ళు టైముంది హేమా?"

"త్రీమంత్స్!"

"త్రీమంత్స్!" తనలో తను అనుకున్నట్టుగా గొణుక్కుంది మహతి.

"ఓ. కే. హేమా! ఓ టూ అవర్స్ తర్వాత ఫోన్ చేస్తాను" సీటులోంచి లేచింది మహతి.

"చూడు మహీ! నిన్ను, నీ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్న స్నేహితురాలిని గనక, చివరిసారిగా అడుగుతున్నాను. పెళ్ళి కాకుండా, గర్భవతి కావడం వల్ల నీకు

థ్రిల్లింగ్‌గా వుండవచ్చు. కానీ మీ ఫాదర్, మదరూ, స్టేటస్ వీటి గురించి ఆలోచించావా?"

"నువ్వు నన్ను ఈ ప్రశ్న అడగడం లక్షన్నరోసారి, అవునా? నా జవాబు కూడా అంతే ..... డిటో!"

హాస్పటల్‌నుంచి బయటికొచ్చింది మహతి.

ఆమె మనసంతా తెలియని ఆనందంతో నిండిపోయింది. ఎవరూ చూడకుండా తన గర్భాన్ని ఒకసారి అరచేత్తో తడుముకుని చూసుకోవాల్సింది.

ఆలోచిస్తూ నడుస్తోంది.

** ** ** **

"పెన్నంటే భయపడేవాడు, పెద్ద రచయితలా ఎలా రాసేస్తున్నాడో చూడ్రా" లోనికొస్తూ మూర్తి కామెంట్ చేశాడు. పక్కనే నిధి దయాళ్ కూడా వున్నాడు.

మధుకర్ ఎదురుగా వున్న కుర్చీల్లో ఇద్దరూ కూర్చున్నారు.

"నన్నీవేళ ఒక్కరోజూ వదిలెయ్యకూడదూ" నిధి దయాళ్ వేపు చూస్తూ అడిగాడు మధుకర్.

"లేదురా! ఇన్నాళ్ళూ నిన్ను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేకే, నీకు దూరంగా వున్నాం. ఇవాళొక్కరోజు, అదీ మన నిధిగాడి బర్త్‌డే, మా మీద కోపం లేకపోతే రా. లేకపోతే నీ ఇష్టం" మూర్తి నిష్ఠూరంగా అన్నాడు.

"టూ అవర్స్‌లో వదిలెయ్యాలి. అలాగేనా?" చేతిలోని ఫైలుని మూస్తూ అన్నాడు మధుకర్.

"ముందు రా! తర్వాత కండిషన్స్!"

మధుకర్ తన ఛాంబర్‌లోంచి బయటికొచ్చి, సుమదేవ్‌తో చెప్పాడు.

ముగ్గురూ మెట్లు దిగారు.

అప్పటికే అక్కడ మారుతీకారు రెడీగా వుంది.

అప్పటికి సమయం ఆరున్నరయింది.

"పార్టీ స్పాట్ ఎక్కడరా?" కారులోంచి బయటికి చూస్తూ అడిగాడు మధుకర్.

మళ్ళీ స్నేహితుల్ని కలుస్తాడనుకోలేదు. స్నేహితులతోపాటు కార్లో! కొన్ని నెలలుగా అలవాటు పడిన సాధారణ జీవితం. మామూలు వ్యక్తిలా రోడ్డుమీద నడిచిన తన నడక ..... జీవితంలో మరో మలుపుకి ఇది నాంది కాదుగదా! అన్పించింది మధుకర్‌కి.

"అదేరా, మన ఫ్రెండ్ సెంటర్, ఓపెన్ స్ట్రీట్ అక్కడ నువ్వు వస్తున్న సందర్భంగా బారంతా రిజర్వ్ చేశాడు నిధి" గర్వంగా చెప్పాడు మూర్తి.

"సురేష్, విజయ్ ఎలా ఉన్నార్రా? వస్తున్నారా?"

"వాళ్ళిద్దరూ ఎక్కడకు పోతారు గానీ, సుధారాణీ కూడా వస్తోంది. పాపం నువ్వంటే తెగ పిచ్చిరా" నిధి అన్నాడు.

"సుధ వస్తోందా?" సుధారాణి అక్కడకు రావడం మధుకర్‌కి ఇష్టం లేదు-కానీ తప్పదు.

మరో పావుగంటకు మిత్రబృందం ఓపెన్‌స్ట్రీట్ బార్లోకొచ్చింది.

అప్పటికే అక్కడికి చేరుకున్న సురేష్, విజయ్, దేవకాంతలా తయారయిన సుధారాణీ ..... స్వాగత గీతాల్తో మధుకర్‌ని ఆహ్వానించారు.

కాస్ట్లీ డ్రింక్స్‌తో కాస్ట్లీ పార్టీ ప్రారంభమైంది.

తనకు నిధి దయాళ్ అందించిన హాట్ డ్రింక్ గ్లాస్‌ని పక్కకు పెట్టి, కూల్‌డ్రింక్ బాటిల్‌ని అందుకోబోయిన మధుకర్‌ని వారించి--

“ఇవాళ అలాంటివేం కుదరదు. నాకోసం, నా ప్లజర్ కోసం నువ్వు హాట్ డ్రింకు తీసుకోవాల్సిందే. అంతే!”

“అంతే! అంతే!” కోరస్‌గా అన్నారందరూ.

“ఒరేయ్! అలవాటు తప్పిపోయిందిరా. నన్నొదిలేయండి”

“వదిలెయ్యటాలేం లేవు” గ్లాసుని మధుకర్ చేతికి అందిస్తూ అంది సుధారాణి గోముగా.

అందరూ పొలోమని సముద్రంలా తుళ్ళుతూ నవ్వారు.

నలుగురితో పాటు హాట్ డ్రింకు మెల్లమెల్లగా మధుకర్ గొంతులోకి జారింది.

*　　　　　　*　　　　　　*　　　　　　*

“ఏం ఫోన్ చేస్తానన్నావ్! వచ్చేవేం? ఆత్రం ఆపుకోలేక పోయావ్ గదూ!”

సడన్‌గా, హాస్పిటల్లో, డాక్టర్ రూంలోకి అడుగుపెట్టిన మహతి వేపు చూస్తూ అడిగింది డాక్టర్ హేమలత. అప్పుడే వచ్చిన స్కానింగ్ రిపోర్ట్‌ను చూస్తోంది హేమలత.

“అది నా స్కానింగ్ రిపోర్టు కదూ?” కూర్చుంటూ అడిగింది మహతి.

“మేల్ బేబీ మహీ!” ఆనందంతో మాటలు రాలేదు మహతికి.

“ఆడపిల్లకు జీవితంలో అపురూపమైన సన్నివేశం ఇది. తను తల్లి అవుతున్నానని మొట్టమొదటిసారి తెలుసుకున్న ఆడపిల్ల ఆ అనుభూతిని తన వాళ్ళతో పంచుకోడానికి ఎంత తపన పడుతుందో తెల్సా? కానీ నీ అనుభూతిని పంచుకోడానికి ఈ క్షణంలో ఎవ్వరూ లేరు రియల్లీ ఐ పిటీ యూ ..... మైడియర్ ఫ్రెండ్!”

మహతి తీసుకున్న నిర్ణయం పట్ల మొదటినుంచీ కోపంగా వున్న హేమలత, మహతి ఏమనుకుంటుందో అని ఆలోచించకుండా ఆ మాట అనేసింది.

"నా అనుభూతిని పంచుకోడానికి నువ్వు లేవా హేమా?" అనేసి స్కానింగ్ రిపోర్టును పట్టుకొని బయటికెళ్ళిపోయింది.

"మహీ!" లోపల్నుంచి హేమలత పిలుస్తోంది. ఆ పిలుపును విన్పించుకోలేదు మహతి.

అప్పుడు టైమ్ సరిగ్గా 8-45 నిమిషాలయింది.

*　　　　*　　　　*　　　　*

జోకులు, సరదాలు, కాలేజీ ముచ్చట్లు, జ్ఞాపకాలతో కాలం గాడిచిపోతోంది.

అందరూ నాలుగో రౌండ్‌లో వున్నారు.

ఎంత వద్దనుకున్నా ..... మిత్ర బృందం చేతిలో పడిపోయాడు మధుకర్.

నాలుగో పెగ్ కాక్‌టెయిల్ ..... ఆ విషయం మధుకర్‌కి తెలీదు.

సుధారాణే స్వయంగా అందించింది.

అందరూ గాల్లో ఎగురుతున్న గాలిపటాల్లా అటూ ఇటూ ఊగుతున్నారు.

" నేనో జోకు చెబుతాను." మూర్తివేపు కన్నుగొడుతూ అంది సుధ.

"త్రిబుల్ ఎక్స్ జోకు కావాలి ..... " సురేష్ ముద్ద ముద్దగా అన్నాడు.

"అలాంటిదే ముందు విను. మా వార్డెన్ వుండికదా. ఆవిడకి ఇప్పటికీ పిల్లల్లేరుగదా. నాకు పిల్లల్లేరు అని చాలాకాలం ఆవిడ వర్రీ అయింది. కనబడిన ప్రతివాళ్ళతో తనకు పిల్లల్లేరని చెప్పుకొని, సానుభూతి సంపాదించేదావిడ ఈ మధ్య పిల్లల్లేరు, పిల్లల్లేరని చెప్పుకొని తిరగడం మానేసింది తెలుసా."

“ఎందుకట.”

“ ఈ వయసులో పిల్లలెలా పుడాతారో జ్ఞానోదయమై వుంటుంది” విజయ్ అన్నాడు.

“యూ ఆర్ రాంగ్”

“మరి పిల్లలు పుట్టరని డాక్టర్ చెప్పేసి వుంటుంది.”

“ఇదీ తప్పే.”

“మరి చంపక అదేదో చెప్పితగలడు తల్లి.”

“ఏం లేదు. భార్య బాధ భరించలేక వాళ్ళాయన మా ఆవిడకు పిల్లల్లేరుగానీ, నాకున్నారు అని చెప్పుకు తిరగడం మొదలుపెట్టాట్ట ..... అందుకు” ఆ జోక్కి బారు, బారంతా నోరు తెరుచుకుని నవ్వింది. ఆ నవ్వులహోరు తగ్గడానికి అయిదునిమిషాలు పట్టింది. జోకులమధ్యలో మరో పెగ్గు నెత్తికెక్కింది.

మధుకర్ అయితే గాల్లో తేలిపోతున్నాడు. మిగతా మిత్ర బృందానికి మధుకర్ అలా తమలో కల్సిపోవడమే కావాలి.

“ఒరే నిధీ బతుకంతా బార్లోనేనా గెస్ట్‌హౌస్ వుందా?” మధుకర్ మాటలు తడబడుతున్నాయి.

“ఒరే చిట్టికన్నా. నీకోసం హన్నీ రెడీగా వున్నాయిరా. ఒరేయ్ పదండ్రా. రిమైనింగ్ పార్టీ హోటల్ త్రిలోకాలో ఓ. కే.”

త్రిలోక్ ..... త్రిలోక్ పేరు వినగానే మధుకర్ నరాలు జివ్వుమన్నాయి.

“కమాన్ గెటప్, మూవ్.”

అందరూ బార్లోంచి బయటికొచ్చి కారెక్కారు.

కారుని మూర్తి డ్రయివ్ చేస్తున్నాడు. అందరూ హైపిచ్‌లో వున్నారు.

"ఒరే మూర్తిగా సరిగ్గా డ్రైవ్ చెయ్యరోయ్. స్పీడు ..... స్పీడు ..... తగ్గించరోయ్"సురేష్ అరుస్తున్నాడు.

"నాకు ఓన్‌కారు లేకపోయినా, డ్రైవింగ్ తెల్సులేవోయ్" మూర్తి వెనక్కితిరిగి అనబోయి, దబ్‌మని ఏదో శబ్దం రావడంతో సడన్‌బ్రేక్ వేశాడు.

అప్పటికే రోడ్డుపక్కనున్న ఖాళీరిక్షా గొడుగులా వెళ్ళి ఒకింత దూరంలో పడింది.

దూరంగా పాన్‌డబ్బా దగ్గరున్న రిక్షావాడు బండబూతులు తిట్టుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు.

కానీ--

అప్పటికే మూర్తి జాగ్రత్తపడ్డాడు. గేరుమార్చి, స్పీడ్ పెంచాడు. సర్‌మని కారు ముందుకు దూసుకుపోయింది.

కానీ--

వాళ్ళెవరూ గమనించని విషయం అల్లంత దూరాన పడిన రిక్షా పక్కన నడుచుకుంటూ వస్తున్న మహతి.

ఆ కారుని, కారులోని వ్యక్తుల్ని చూసి, నోటమాటరాక నిల్చుండిపోయింది.

బ్యాక్‌సీటులో స్పష్టంగా కనిపించిన మధుకర్‌ని చూడగానే, ఎందుకో ఆమె వంటినిండా చెమటలు పట్టేశాయి. ఆసమయంలో మధుకర్ భుజమ్మీద సుధారాణి చేతుల్ని చూడగానే.

ఏం జరిగిందో, ఏం జరగబోతుందో ఊహించలేక పోతోంది మహతికి.

మళ్ళీ వీళ్ళందరూ ఎలా కలిశారు?

మరొక్క క్షణం కూడా ఆలోచించలేదు మహతి. వెళ్ళిపోతున్న ఆటోని ఆపి ఆ కారుని ఫాలో అయింది. త్రిలోకా హోటల్ ముందు కారాగిన పదినిమిషాలకు దూరంగా ఆటో ఆగింది. అందులోంచి మహతి దిగింది.

*          *          *          *